బహుమతులు పొందిన విద్యార్థినులతో అధికారులు

జాతీయ సంగీత నృత్య పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

పోచమ్మమైదాన్, ఆగస్టు 12: రాయలసీమ రంగ స్థలి ఆధ్వర్యంలో తిరుపతిలో మూడు రోజులపాటు నిర్వహించిన శ్రీకృష్ణ దేవరాయ జాతీయ సంగీత నృత్య పోటీల్లో హనుమకొండకు చెందిన విద్యార్థినులు ప్రతిభ చాటారు. హనుమకొండలోని ది టెంపుల్ డ్యాన్స్, ది స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థినులు జూనియర్ కూచిపూడి విభాగంలో గజం చన్విత ప్రథమ, జనన్యవర్మ స్పెషల్, సీనియర్ కేటగిరిలో డి.హన్విక ద్వితీయ సాధించినట్లు మాస్టర్ కాట్రగడ్డ హిమాన్సీ తెలిపారు. పీసీఆర్ వేర్ హౌసింగ్ ఎండీ రాయల్, ఫిల్మ్ సొసైటీ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, రిటైర్డు డిప్యూటీ ఈవో రమణ, టీసీటీ మాజీ బ్యాంకు చైర్మన్ సతీష్, ఐక్యవేదిక అధ్యక్షుడు మునిరత్నం, తిరుపతి ఫిలిం సొసైటీ అధ్యక్షుడు వైస్ బాబు, వేణుగోపాల్‌రెడ్డి చేతులమీదుగా బహుమతులు అందుకున్నట్లు వివరించారు.

నేడు విద్యుత్ అంతరాయం

చెన్నారావుపేట, ఆగస్టు 12: మండల కేంద్రంతో పాటు ఉప్పరపల్లి, లింగగిరి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు డీఈఈ శ్రీధర్ సోమవారం తెలిపారు. చెన్నారావుపేటలోని 33/11కేవీ ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా మండలంలోని 33/11కేవీ ఉప కేంద్రాలన్నింటిలో ఉదయం 9 నుంచి 12గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

రెండు రోజులుగా కరెంట్ బంద్

- కుమ్మరివాడలో పాడైన ట్రాన్స్‌ఫార్మర్
- మరమ్మతులు ఆలస్యంతో ఇబ్బందులు

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

కరీమాబాద్, ఆగస్టు 12: ఉర్సు ప్రాంతం కుమ్మరివాడ గాంధీబొమ్మ వద్ద రెండు రోజులుగా కరెంట్ సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ కనెక్షన్లు అధిక సంఖ్యలో ఉండడంతో ట్రాన్స్‌ఫార్మర్ తరచూ కాలిపోతోంది. ట్రాన్స్‌ఫార్మర్ మళ్లీ ఆదివారం కాలిపోగా సోమవారం వరకు అధికారులు మరమ్మతు చేయలేదు. దీంతో రెండు రోజులుగా కరెంట్ సరఫరా లేదు. మరమ్మతులు ఆలస్యమవుతుండడంతో అధికారులపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై అధికారులను వివరణ కోరగా ట్రాన్స్‌ఫార్మర్‌కు సుమారు 600 కనెక్షన్లు ఉన్నాయని, ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోగా మరమ్మతులు చేస్తున్నామని తెలిపారు. కొత్తది స్టోర్‌లో లేదని, అందుకే మరమ్మతులు చేస్తున్నామని చెప్పారు.

తపాలా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

గీసుగొండ, ఆగస్టు 12 : తపాలా శాఖ పొదుపు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ వరంగల్ దక్షిణ ఉప మండల అధికారి వరప్రసాద్ అన్నారు. మండలంలోని కొమ్మాల, విశ్వనాథపురంలో సోమవారం సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలికలు, వృద్ధులు, ఉద్యోగులు, గ్రామీణ ప్రజలకు తపాల శాఖలో ఉన్న సుకన్య సమృద్ధి యోజన, సీనియర్ సిటిజన్, సేవింగ్స్ స్కీములతో పాటు ఇతర బీమా పథకాలను వివరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ నరేశ్, బీపీఎం అరవింద్, శివకోటి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల యాజమాన్యం చేసుకోవాలి

కాశీబుగ్గ, ఆగస్టు 12: భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల యాజమాన్యం చేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ రావుల ఉమారెడ్డి అన్నారు. సోమవారం పైడిపల్లిలోని వ్యవసాయ పరిశోధన స్థానంలో నాబార్డు వారి ఆర్థికసాయంతో రైతులకు ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు క్రమం తప్పకుండా భూసార పరీక్షలు చేసుకోవాలని సూచించారు. భూసార పరీక్ష ఆధారంగా ఎరువులు వేసుకోవాలని సూచించారు. దీంతో రైతులకు ఖర్చు తగ్గుతూ నేలసారం, వాతావరణ కాలుష్యం తుగ్గుతుందని తెలిపారు. శాస్త్రవేత్త జి.వీరన్న, రాములు, శాస్త్రవేత్తలు రైతులకు శిక్షణ నిర్వహించారు.

ప్రభుత్వ హామీలను నెరవేర్చాలి

పీఆర్‌టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ గఫార్

రాయపర్తి, ఆగస్టు 12: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ గఫార్ కోరారు. సోమవారం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో పీఆర్‌టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏ విడుదల చేయాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. మండల అధ్యక్షుడు ఆవుల రవీందర్, గాదె ప్రవీణ్‌రెడ్డి, పీ సమ్మారెడ్డి, ప్రసాదరావు, పీఅంజయ్య, కటకం రఘు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★ I, **RAPARTHY RAJESHWAR** (New name) previously called **RAPARTHY RAJESAWAR** (Old Name), S/o **RAPARTHY NAGAIAH,** R/o. "H" Towers, Flat no. 302, Opp: Filter bed, Warangal district - 506002. T.S. Solemnly declare.

NTW-17194

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552 HANAMKONDA
9182777563
9182777618 WARANAGAL
9182777556 JAYASHANKAR BHUPALPALLY
9182777559 MULUGU
9182777135 JANGAON
9182777565 MAHABUBABAD
9182777557

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

కరీమాబాద్, ఆగస్టు 12: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రంగశాయిపేట జూనియర్ కళాశాల వద్ద జెండా ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు నద్దనూరి అశోక్ స్టాలిన్ మాట్లాడుతూ 88 ఏళ్లుగా విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్నట్లు తెలిపారు. విద్యారంగ సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమన్నారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు, జూనియర్ కళాశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టై, బెల్టుల పంపిణీ

నెక్కొండ, ఆగస్టు 12: నెక్కొండ ప్రాథమిక పాఠశాలలో పదోన్నతి పొందిన హెచ్ఎం జాన్ నాయక్, ఉపాధ్యాయులు అయిలయ్య సోమవారం విద్యార్థులకు ఉచితంగా టై, బెల్టులను అందించారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రంగారావు చేతుల మీదుగా పంపిణీ చేశారు.

కంపాస్ బాక్స్‌లు..

పోచమ్మమైదాన్ : వరంగల్ ఎల్‌బీ నగర్‌లోని ప్రభుత్వ చార్‌బౌలి పాఠశాలలో విద్యార్థులకు సోమవారం కంపాస్ బాక్స్‌లను పంపిణీ చేశారు. రామకృష్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాఠశాలలోని 150 మంది హైస్కూల్ విద్యార్థులకు జాతీయ పతాక రంగులతో కూడిన బాక్స్‌లను అందజేశారు. పాఠశాల హెడ్‌మాస్టర్ ఎర్రబెల్లి నర్సింగరావు, ట్రస్ట్ నిర్వాహకుడు రామకృష్ణ, ఉపాధ్యాయులు రఫీ, శ్రవణ్, రత్నాకర్ పాల్గొన్నారు.

ప్రజావాణికి వినతుల వెల్లువ

- భూ సమస్యలపై 70 మంది ఫిర్యాదులు
- 'దళితబంధు'కు 159 మంది దరఖాస్తు
- నేడే చివరి తేదీ అంటూ ప్రచారం

చెన్నారావుపేట : కలెక్టర్ సత్యశారదాదేవికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

ఖిలావరంగల్, ఆగస్టు 12 : వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి భారీగా వినతులు వచ్చాయి. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు దళిత బంధు దరఖాస్తుకు ఈ రోజే చివరి తేదీ అని ప్రచారం చేసి, దరఖాస్తు ఫారానికి రూ.20 నుంచి రూ.50 వరకు వసూలు చేశారు. ఈ క్రమంలో 159 మంది దరఖాస్తు చేసుకున్నారు. భూ సంబంధిత సమస్యలతో 70 మంది దరఖాస్తు చేసుకున్నారు. 1972 సంవత్సరంలో సర్వే నంబర్ 7/7లో తన ఎకరం భూమికి రాష్ట్ర ప్రభుత్వం పాస్ బుక్ ఇవ్వాలని రాయపర్తి మండలం తిరుమలాయపల్లికి చెందిన మచ్చ నర్సింహరాములు ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. రాయపర్తి శివారులో సర్వే నంబర్ 1185సీలో 1.30 ఎకరాలు ఉందని, రికార్డుల ప్రక్షాళన సమయంలో కేవలం 20 గుంటలు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదైందని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, దీంతో సివిల్ కోర్టును ఆశ్రయించగా 1.30 ఎకరాలు తనదేనని తీర్పు వచ్చిందని, తన పేర పట్టా ఇప్పించాలని కలెక్టర్‌ను కోరారు. ఎలాంటి స్థలం లేని తనకు నివాస స్థలం ఇప్పించాలని ఉర్సుకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు శనిగరపు ముత్తయ్య భార్య కమలమ్మ వినతిపత్రం ఇచ్చారు. గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్‌లోని ధర్మారం ప్రభుత్వ పాఠశాలతో పాటు నల్లబెల్లి పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని, బీఎస్ఎఫ్ స్వేరోస్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడ మరుగుదొడ్లు, తరగతి గదులు, ప్రహరీ నిర్మించాలని, పందులు, కుక్కలు స్వైరవిహారం చేయడంతో బురద ఏర్పడి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కేజీబీవీల్లో సమస్యలను పరిష్కరించాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, శనిగరపు రాజేంద్రప్రసాద్ వినతిపత్రం సమర్పించారు. కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ ప్రజావాణిలో స్వీకరిస్తున్న విజ్ఞప్తులను సత్వరమే పరిష్కరించాలన్నారు. సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. పరిష్కారానికి వీలు లేకుంటే తదుపరి చర్యల కోసం వారికి అర్థమయ్యేలా సూచనలు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణి, డీఆర్డీవో కౌసల్యాదేవి, ఆర్డీవో కృష్ణవేణి, ఏవో శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రోత్సహించాలి

ఖిలా వరంగల్: పంట రుణాలు మాఫీ పొందిన రైతులను వెంటనే రెన్యూవల్ చేసుకునేలా ప్రోత్సహించాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. సోమవారం వరంగల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో మొదటి, రెండో విడుతల్లో రైతు రుణమాఫీ, రెన్యూవల్ పురోగతిపై బ్యాంకర్లు, వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ లక్షన్నర రుణమాఫీ పొందిన రైతులకు లబ్ధి చేకూరేలా చూడాలన్నారు. బ్యాంక్ అధికారులు రుణమాఫీ డబ్బులను ఇతర రుణాల కింద జమ చేయొద్దని సూచించారు. ఏఈవోలు, ఏవోలు, బ్యాంక్ అధికారులు రుణాలు రెన్యూవల్‌పై రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణి, ఏడీఏ ఉషాదయాల్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజు, డీసీవో సంజీవరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడి పేదలకు పంచాలి

చెన్నారావుపేట : మండలంలోని పనికర గుట్ట వద్ద ప్రభుత్వ భూమిని కాపాడి పేదలకు పంచాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్ కోరారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమంగా పట్టా చేయించుకొని గుడిసెవాసులపై దౌర్జన్యం చేస్తున్న సాంబయ్య, నవీన్‌రెడ్డిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ సత్య శారదాదేవికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పనికర గుట్ట వద్ద 2006 నుంచి గుడిసెలు వేసుకొని నివసిస్తున్న పేదలను నవీన్‌రెడ్డి, అతడి అనుచరులు బెదిరిస్తున్నారని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్, ఎస్సై హామీ ఇచ్చినా న్యాయం చేయలేదని పేర్కొన్నారు. వెంటనే స్పందించి ఆదుకోవాలని కోరారు. సీపీఐ నాయకులు కే కేశవులు, రమేశ్, మునీశ్వరుడు, యాకయ్య, రజిత, వెంకటలక్ష్మి, రాజేశ్, శ్రీను, సావిత్రి, రేణుక పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

ఖిలావరంగల్: స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఖిలావరంగల్ ఖుష్‌మహల్ మైదానాన్ని డీసీపీ రవీందర్, అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి కలెక్టర్ సందర్శించారు. ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య వేడుకల్లో ప్రొటోకాల్ తాగునీటి సరఫరా, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాట్లు చేయాలన్నారు. వేదిక అలంకరణ, వేడుకలకు వచ్చే అతిథులకు, ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఆర్డీవో కృష్ణవేణి, ఆర్ అండ్ బీ అధికారి రెడ్డి, తహసీల్దార్ నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు. అనుసరించి సీటింగ్ ఏర్పాట్లు ఉండాలన్నారు.

టీపీఎస్‌లకు డివిజన్ల కేటాయింపు

వరంగల్, ఆగస్టు 12 : ఇటీవల టౌన్ ప్లానింగ్ విభాగంలో జరిగిన బదిలీల్లో భాగంగా కొత్త వచ్చిన టీపీఎస్‌లకు డివిజన్లను కేటాయించారు. కాశీబుగ్గ సర్కిల్ పరిధిలో ఏసీపీ–1గా ఖలీలుద్దీన్, ఏసీపీ–2గా శ్రీనివాస్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. టీపీఎస్ అవినాశ్‌కు 34,35,36,37,38,41,43 డివిజన్లు, నరేందర్‌కు 18,19,23,24,25,26,27 డివిజన్లు, ఎండీ ఖాజా షరీఫ్‌కు 13,14,20 డివిజన్లు, కే అనిల్ కుమార్‌కు 28,32,33,39,40,42,44 డివిజన్లు, పీ నవీన్‌కు 3,12,15,16,17,21,22 డివిజన్లను కేటాయించారు. కాజీపేట సర్కిల్ పరిధిలో ఎండీ ఇర్షాద్ – ఏసీపీ–3గా, ఎస్ రజిత ఏసీపీ–4గా ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. టీపీబీవో రాజు నాయక్‌కు 1,2,4,5,6,54 డివిజన్లు, టీపీఎస్ అవినాశ్‌కు 7,8,9,10,11,29,30 డివిజన్లు, ఆర్ సతీశ్‌కు 53,55,56,65,66 డివిజన్లు, ఆర్ రోజా రెడ్డికి 57,58,59,60,61,62 డివిజన్లు, వెంకటరమణకు 45,46,47,63,64 డివిజన్లను కేటాయించారు.

హిందువులపై అరాచకాలను ఖండించాలి

కాశీబుగ్గ, ఆగస్టు 12: బంగ్లాదేశ్‌లో హిందువులపై అరాచకాలను అందరూ ఖండించాలని రాష్ట్రీయ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు మడిపల్లి నాగరాజు గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం కాశీబుగ్గ చౌరస్తాలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై ఆఘాయిత్యాలు జరుగుతున్నా ఏ ఒక్క రాజకీయపార్టీ నోరు మెదపకపోవడం బాధాకరమన్నారు. కోమాకుల నాగరాజు, పత్రి సుభాష్, బండి నగేష్, ముచ్చర్ల ప్రభాకర్, రామ నాగార్జున, గోగికార్ శ్రవన్, పిట్టల కోటి, ఆడెపు రమేష్, బోడ సంజీవ, నేతికర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

75 అడుగుల జెండాతో తిరంగా యాత్ర

పోచమ్మమైదాన్/గిర్మాజీపేట, ఆగస్టు 12: హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో వరంగల్ జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు ఎర్రగొళ్ల భరత్ వీర్ ఆధ్వర్యంలో సోమవారం పోచమ్మమైదాన్ నుంచి వరంగల్ రైల్వే స్టేషన్ వరకు జాతీయ జెండాతో తిరంగా యాత్ర నిర్వహించారు. 75అడుగుల పొడవైన జాతీయ జెండాతో 300మంది యువతతో కలిసి యాత్ర చేపట్టారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో జాతీయభావాన్ని పెంపొందించేందుకు పార్టీ కృషి చేస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ ఈనెల 15న తమ ఇళ్లపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. 28వ డివిజన్ కార్పొరేటర్ గందె కల్పన ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా అభియాన్‌లో భాగంగా జాతీయ జెండాలను సోమవారం పిన్నవారివీధిలో స్థానికులకు అందించారు. నాయకులు గందె నవీన్, తాటికొండ రాము, కొత్తపల్లి రాజేశ్, ప్రజలు పాల్గొన్నారు.

బెస్ట్ టీచర్ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

గిర్మాజీపేట, ఆగస్టు 12: ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుకు జిల్లా పరిషత్, ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఎయిడెడ్, ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈవో డీ వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. రెండు ప్రతులను సంబంధిత ఎంఈవోలకు ఈనెల 22న సమర్పించాలని కోరారు.

ఉరేసుకొని ఆత్మహత్య

వర్ధన్నపేట, ఆగస్టు 12: మండల కేంద్రంలో దోపతి ఎల్లయ్య(60) సోమవారం అనారోగ్యంతో మనస్తాపానికి గురై ఇంట్లోని బాత్‌రూమ్ వద్ద ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఎల్లయ్య ఆరు నెలలుగా కాలు మడమ నొప్పితో బాధపడుతున్నాడు. రెండు నెలల క్రితం ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించగా నొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య వెంకటలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి

కాశీబుగ్గ, ఆగస్టు 12: అపరిచితులపై బాలికలు అప్రమత్తంగా ఉండాలని షీ టీమ్ హెడ్ కానిస్టేబుల్ సూర్యనారాయణ సూచించారు. సోమవారం 18వ డివిజన్‌లోని ప్రభుత్వ గ్రేన్ మార్కెట్ హైస్కూల్‌లో బాలికలకు సైబర్ నేరాలు, మహిళలపై లైంగిక దాడిపై అవగాహన కల్పించారు. హెడ్ మాస్టర్ నరసింహారావు, ఉపాధ్యాయులు సృజన, మనోహర్, తిరుపతి, వీణ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

వర్ధన్నపేట, ఆగస్టు 12: బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శ్రీలక్ష్మీ నర్సింహ ఆస్పత్రి వైద్యులు పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. పేదల కోసం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు బాల వికాస ప్రతినిధి పిట్టల రాణి తెలిపారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బొల్లికొండలో..

నెక్కొండ : మండలంలోని బొల్లికొండలో సామాజిక కార్యకర్త, మానవ హక్కుల సంఘం నాయకుడు బానోత్ రమేశ్‌నాయక్ విషజ్వరాలు ప్రబలుతున్నాయని సమాచారం ఇవ్వగా కలెక్టర్ ఆదేశాలతతో అలంకానిపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. నర్సంపేట డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రకాశ్ పలు సూచనలు చేశారు. అలంకానిపేట పీహెచ్‌సీని సందర్శించి రికార్డులు పరిశీలించి పరిస్థితి సమీక్షించారు. వైద్యశిబిరంలో 103 మందికి పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. డాక్టర్లు అర్చన, సుమన్, సుధా రాహుల్, సూపర్‌వైజర్ రమాదేవి, ల్యాబ్‌టెక్నీషియన్ డీఎన్‌రెడ్డి వైద్యసిబ్బంది ప్రవళిక, కార్యదర్శి పెంటయ్య పాల్గొన్నారు.

పరామర్శ

దుగ్గొండి, ఆగస్టు 12: మండలంలోని వెంకటాపురానికి చెందిన లోనె రాధాబాయి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. సోమవారం ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజీ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మోర్తాల చందర్‌రావు, జండ రాజేశ్, హింగె భుజంగారావు, సుకినె రాజేశ్వర్‌రావు, రవికుమార్, రమే శ్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ సమస్యలను పరిష్కరిస్తా..

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

వర్ధన్నపేట, ఆగస్టు 12: మండలంలోని ఇల్లంద కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. 'ఇల్లంద కేజీబీవీపై నిండా నిర్లక్ష్యం' శీర్షికన 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ఆదివారం కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఎమ్మెల్యే ఆదివారం ఇల్లంద కేజీబీవీని సందర్శించారు. వర్షాలు కురిసి పాఠశాల ఆవరణ చిత్తడిగా మారగా విద్యార్థినులు దాటేందుకు నీళ్లలో వేసుకున్న ఇటుకలను చూశారు. మైదానం అపరిశుభ్రంగా ఉండడాన్ని గుర్తించారు. అధికారులకు ఫోన్ చేసి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పాఠశాలలో సెప్టిక్ ట్యాంక్‌ను శుభ్రం చేయించకపోవడంతో దుర్వాసనతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకొని వెంటనే ట్యాంక్‌ను శుభ్రం చేయించాలని ఎంపీడీవోను ఆదేశించారు. తరగతి గదుల్లో కిటికీలు, దర్వాజలు పలుచోట్ల పాడైపోయి ఉండగా మరమ్మతులు చేయించాలని స్థానిక నాయకులకు సూచించారు. భోజనశాలలో ఆహార పదార్థాలను పరిశీలించి సరుకులు రవాణా చేసే కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై నాణ్యమైన వస్తువులు అందించాలని ఆదేశించారు. విద్యార్థినుల తరగతి గదులకు వెళ్లి వారితో మాట్లాడి బాగా చదువుకోవాలని సూచించారు. ఎంపీడీవో వెంకటరమణ, ఎస్‌వో కరుణశ్రీ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఇల్లంద కేజీబీవీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

ఉద్యోగులకు ఘన నివాళి

నల్లబెల్లి, ఆగస్టు 12 : మృతి చెందిన ఉద్యోగులకు తోటి ఉద్యోగులు సోమవారం ఘనంగా నివాళులు అర్పించారు. సమగ్ర శిక్షాలో ఉద్యోగం చేస్తూ మృతిచెందిన వారికి ఎమ్మార్సీ భవనం ఎదుట నివాళులు అర్పించారు. సమగ్ర శిక్షా ఐక్య వేదిక గౌరవ అధ్యక్షుడు సుద్దాల ఆనందం, ఉద్యోగులు రాజేశ్వరీ, విజయ్‌కుమార్, భిక్షపతి, రవి, వెంకటయ్య, రాంబాబు, వీరాచారి తదితరులు పాల్గొన్నారు.

నగర ప్రధాన నాలాలను విస్తరించాలి

మేయర్ సుధారాణి

వరంగల్, ఆగస్టు 12 : వరద నివారణలో భాగంగా నగర ప్రధాన నాలాలను విస్తరించాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్‌లో కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడేతో కలిసి ఆమె నాలాల విస్తరణ, ఎల్ఆర్ఎస్ అంశాలపై ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత వారం హైదరాబాద్‌లో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ నగర సమగ్రాభివృద్ధిపై నిర్వహించిన సమావేశంలో పేర్కొన్న పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. వడ్డేపల్లి, భద్రకాళీ, శాకరాశికుంట, భట్టుపల్లి, చిన్న వడ్డేపల్లి, కట్ట మల్లన్న నాలాల ద్వారా సులువుగా వరద నీరు వెళ్లేలా నాలాలపై అక్రమణలు, అనధికార నిర్మాణాలను జిల్లా టెక్నికల్ కమిటీ నిర్ణయించిన ప్రకారం తొలగించాలన్నారు. ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) కింద క్రమబద్ధీకరణకు చేసుకున్న లక్ష దరఖాస్తులను ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందిన వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. నగరంలో ప్రధాన, అంతర్గత రహదారులపై ఏర్పడిన గుంతలను ఎప్పటికప్పుడు పూడ్చాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ రాజేందర్‌రెడ్డి, ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, రాజయ్య, సీఎంహెచ్‌వో రాజేశ్, డిప్యూటీ సిటీప్లానర్ రవీంద్ర, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రవీందర్, లీగల్ అధికారి శ్రీనివాస్, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈలు శ్రీనివాస్, మహేందర్, టీపీవో ఇర్షాద్ పాల్గొన్నారు.

మొరం అక్రమ తవ్వకాలపై విచారణ

'నమస్తే తెలంగాణ' ఎఫెక్ట్


మొరం తవ్వకాలు చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రాయపర్తి, ఆగస్టు 12: మండలంలోని ఎస్సారెస్పీ కాల్వలకు ఇరువైపులా మొరం అక్రమ తవ్వకాలు, తరలింపుపై అధికారులు విచారణ చేపట్టారు. మండలంలో మొరం అక్రమ తవ్వకాలు చేసి, పట్టణాలకు తరలిస్తుండడంపై సోమవారం 'ఎస్సారెస్పీ మొరం తరలింపు' శీర్షికతో 'నమస్తే'లో కథనం ప్రచురితమైంది. దీంతో నీటిపారుదల శాఖ, మండల రెవెన్యూ శాఖల ఆదేశాల మేరకు ఎస్సారెస్పీ ఏఈలు బాలదాసు, మన్సూర్‌నాయక్, రెవెన్యూ గిర్దావర్ కొయ్యాడ చంద్రమోహన్ మండలంలోని ఎస్సారెస్పీ కాల్వల గట్లపై అక్రమ మొరం తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించారు. స్థానికులు, తండావాసులతో మాట్లాడారు. అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు చేపట్టే వారి సమాచారాన్ని తమకు ఇవ్వాలని కోరారు.

అక్రమంగా ఎరువుల బస్తాలు తరలింపు

చెన్నారావుపేట, ఆగస్టు 12: చెన్నారావుపేట సహకార సంఘం పరిధిలోని పాపయ్యపేట ఎరువుల గోదాంకు చెందిన ఎరువుల బస్తాలను ప్రైవేట్ ఫర్టిలైజర్‌కు తరలించిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. మండలంలోని పాపయ్యపేట గోదాం సేల్స్‌మెన్ మంచాల శ్రీనివాస్ రైతుల ఆధార్ నంబర్లు, తప్పుడు రికార్డులు పెట్టి బోజెర్వు, పాపయ్యపేట రైతుల పేరుతో 74 ప్రభుత్వ ఎరువుల బస్తాలను అక్రమంగా గూడూరు మండల కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ షాపునకు తరలించినట్లు రైతులు తెలిపారు. ఈమేరకు అధికారులకు పలువురు ఫిర్యాదు చేయగా గూడూరు ఏఓ సదరు ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేసి అక్రమంగా తరలించిన ఎరువుల బస్తాలను సీజ్ చేసి మహబూబాబాద్ జాయింట్ కలెక్టర్‌కు అప్పగించారు. షాపు యజమానిపై గూడూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. విచారణ జరిపిన నర్సంపేట ఏడీఏ కీసరి నగేశ్ ఎరువుల బస్తాలు తరలించింది నిజమేనని తేలడంతో సహకార సంఘం జిల్లా అధికారి సంజీవరెడ్డికి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. డీసీఓ సంజీవరెడ్డి స్పందిస్తూ విచారణ చేస్తామని అక్రమాలకు పాల్పడినట్లు తేలితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా, మంచాల శ్రీనివాస్‌ను సస్పెండ్ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న ఉర్సు ప్రజలు

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయండి

కరీమాబాద్, ఆగస్టు 12: ఉర్సు కుమ్మరివాడలో ట్రాన్స్‌ఫార్మర్ తరచూ పాడైపోతోందని, కొత్తది ఏర్పాటు చేయాలని కోరుతూ స్థానికులు సోమవారం ఏడీ సర్వేశంకు వినతిపత్రం అందజేశారు. ట్రాన్స్‌ఫార్మర్ రెండు రోజుల క్రితం కాలిపోగా, కరెంట్ సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. గడ్డం యుగేందర్, నాగపూరి రవి చందర్, కృష్ణ, సల్ల సారంగం, ఆవునూరి భాస్కర్ పాల్గొన్నారు. కాగా, ఈ ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ కనెక్షన్లు ఉండటంతో తరుచూ పాడైపోతోందని, కొత్తది ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ మరుపల్ల రవి కూడా వినతిపత్రం అందజేశారు. ఆవునూరి వీరేశం, ఆవునూరి కుమార్, చిలుపూరి నగేశ్ పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

రూ.50వేలు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం

నర్సంపేట, ఆగస్టు 12: మండల కేంద్రంలోని పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం అర్ధరాత్రి దాడి చేశారు. ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. స్థానికంగా కొనుకటి సుదన్‌రెడ్డి ఇంట్లో అర్ధరాత్రి పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడి చేసి, పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.50,310 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఇన్‌స్పెక్టర్ రాజు, ఆర్ఎస్ఐ భానుప్రకాశ్, టాస్క్‌ఫోర్స్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

పోరాటాల ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ

ఎమ్మార్పీఎస్ నాయకుడు ప్రణయదీప్ మాదిగ

నర్సంపేట, ఆగస్టు 12: అనేక పోరాటాల ఫలితంగానే ఎస్సీ వర్గీకరణకు సానుకూలత వచ్చిందని ఎమ్మార్పీఎస్ నాయకుడు కల్లెపెల్లి ప్రణయదీప్‌మాదిగ తెలిపారు. సోమవారం నర్సంపేటలో ధర్మవిజయదండోరా యాత్ర పేరుతో వరంగల్ రోడ్డు నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా అనేక రూపాల్లో ఉద్యమించినట్లు తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ నాయకులందరూ రాజకీయాలకతీతంగా పాల్గొన్నారు. చింతం సిద్ధు, బొచ్చు రఘుపతి, బానాల రమేశ్, వేల్పుగొండ రాజు, బానాల శ్రీనివాస్, మంద ప్రకాశ్, మాదాసి బాబు, కొమ్ముల కర్ణాకర్ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఖానాపురం, ఆగస్టు 11 : మండలంలోని 85 మంది లబ్ధిదారులకు సోమవారం మండల కేంద్రంలో ఏఎంసీ వైస్ చైర్మన్ హరిబాబు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. 85 మంది లబ్ధిదారులకు రూ.24.79లక్షల చెక్కులను అందజేసినట్లు ఆయన తెలిపారు. నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్‌రెడ్డి, ఎలగందుల రాజు, లాల్‌సాబ్, కావటి రమేశ్, రవీందర్ పాల్గొన్నారు.

సీకేఎం కళాశాలలో చేతిరాత పోటీలు

పోచమ్మమైదాన్, ఆగస్టు 12: వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు సోమవారం చేతిరాత పోటీలు నిర్వహించారు. గ్రంథపాలకుల దినోత్సవం సందర్భంగా గ్రంథాలయ పితామహుడు రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. చేతిరాత పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జీఈ శశిధర్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ ధర్మారెడ్డి, గ్రంథపాలకులు అనిల్‌కుమార్, అధ్యాపకులు హరిబాబు, ప్రకాశం, రాజేష్, స్రవంతి, రజిత, నాగరాజు, సుమన్, చంద్రమోహన్, వేణుగోపాల్, సరిత, సురేశ్, రాజు, కొమురయ్య, రామరాజు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

గీసుగొండ, ఆగస్టు 12 : చెరువులో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో సోమవారం జరిగింది. సీఐ బాబులాల్ తెలిపిన వివరాల ప్రకారం.. దౌడు బాబు(43) గ్రామంలో గేదెలు కాస్తూ జీవిస్తుంటాడు. సాయంత్రం గేదెలను నీళ్లు తాగించేందుకు బస్వన్నచెరువుకు తోలుకెళ్లాడు. గేదెలను బయటకు కొట్టె ప్రయత్నంలో కాలుజారి చెరువులో పడ్డాడు. లోతుగా ఉండటంతో మునిగి చనిపోయాడు. స్థానికులు చెరువులో దిగి బయటకు తీయగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విధుల్లో చేరిన డీఐఈవో

గిర్మాజీపేట, ఆగస్టు 12: కొత్త డీఐఈవోగా నియమితులైన శ్రీధర్ సుమన్ సోమవారం విధుల్లో చేరారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది బొకే అందించి స్వాగతం పలికారు. సూపరింటెండెంట్ కృష్ణమోహన్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఎస్‌డీ నిజాముద్దీన్, జూనియర్ అసిస్టెంట్ ఎన్ రాజశేఖర్‌నాయక్, రికార్డ్ అసిస్టెంట్ టీ సందీప్, ఆఫీస్ సబార్డినేట్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలపై పోరాడాలి

కరీమాబాద్ : మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా పోరాడాలని జిల్లా విద్యాధికారి (డీఐఈఓ) డాక్టర్ శ్రీధర్ సుమన్ పిలుపునిచ్చారు. సోమవారం రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ శ్రీధర్ సుమన్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలన్నారు. ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఖిలా వరంగల్, ఆగస్టు 12: బీసీల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో వరంగల్ కలెక్టరేట్‌లో ఎదుట ధర్నా నిర్వహించారు. కులగణన చేపట్టి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని నినదించారు. కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు, రమేశ్, వెంకన్న, రమేశ్, చంద్రశేఖర్, స్వప్న, భార్గవి, సరస్వతి, లక్ష్మి పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నర్సంపేట, ఆగస్టు 12: హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన కరాటే పోటీల్లో నర్సంపేటకు చెందిన గ్లోబల్ షోటోఖాన్ కరాటే డూ ఇండియా సంస్థ విద్యార్థులు ప్రతిభ చూపారు. నర్సంపేటలోని మినీ స్టేడియంలోని గ్లోబల్ షోటోఖాన్ కరాటే డూ ఇండియా సంస్థ విద్యార్థులు ప్రతిభను కనబరిచి విజేతలుగా నిలిచారు. అండర్–16 బాలికల కటాస్ విభాగంలోజీ సమత, ఏ సాహితీ బంగారు పతకాలు, అండర్–12 బాలుర కటాస్ విభాగంలో సిరిన్, నిశాంత్ సిల్వర్ మెడల్ సాధించారు. కోచ్ షేక్‌జానీ, విద్యార్థులు, మాస్టర్స్ జానీ, శ్రీనాథ్‌ను మాస్టర్లు, నిర్వాహకులు అభినందించారు.

ఉప్పరపల్లి విద్యార్థులకు బహుమతులు

చెన్నారావుపేట, ఆగస్టు 12: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం – పచ్చదనంలో భాగంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఉప్పరపల్లి పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించినట్లు హెచ్ఎం జయ సోమవారం తెలిపారు. దాక్షాయని ప్రథమ, రెడ్డబోయిన కీర్తన తృతీయ బహుమతులు సాధించగా ఉపాధ్యాయులు అభినందించారు. టీచర్లు శశిధర్, సంతోష్‌కుమార్, బాలాజీరావు, ఉదయ్‌కుమార్, మొగిలి, సుందర్ పాల్గొన్నారు.